క్లుప్తంగా

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడదాం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సనాతన ధర్మ పరిరక్షణను ప్రతి ఒక్కరూ ముందుండాలని, హిందూ సమాజానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శబరిమల అయ్యప్ప సేవా సమాజం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయనిధి స్టాలిన్ హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో శబరిమల అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర అధ్యక్షులు సంకా శ్రీనివాసరావు(వాసు), కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్, వక్కలగడ్డ రామకృష్ణ స్వామి, నారాయణమూర్తి, కిరణ్‌లతో పాటు పలువురు గురు స్వాములు ఉన్నారు.

అంధ విద్యార్థులకు స్మార్ట్ విజన్ గ్లాసెస్ పంపిణీ



గుణదల (విజయవాడ తూర్పు): దృష్టి లోపాలు కలిగిన యువత, అంధ విద్యార్థులను ప్రోత్సహించే దిశగా సమాజంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని హెల్ప్ ద బ్లైండ్ ఫౌండేషన్ సంస్థ ట్రస్టీ ఎస్. నరసింహన్ అన్నారు. ఆంధ్రలయోల కళాశాలలో దృష్టి లోపాలు ఉన్న విద్యార్థులకు స్మార్ట్ విజన్ గ్లాసెస్(కళ్ల జోళ్లు) పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, అంగవైకల్యం ఉన్నవారికి, అంధులకు ప్రత్యేక లక్షణాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు పలు రంగాలలో వారు సత్తా చాటుతున్నారని వివరించారు. హెల్ప్ ది బ్లైండ్‌ఫౌండేషన్, విజన్ ఎయిడ్ ఇండియా సహకారంతో ఒక్కొక్క కళ్లజోడు రూ.30వేలు ఖరీదు చేసే విజన్ గ్లాసెస్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 14 మందికి స్మార్ట్ విజన్ గ్లాసెస్‌ను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ ప్రభుదాస్, అధ్యాపకులు సహాయ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లలతో ఫ్రెండ్లీగా ఉండాలి

ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి



కంచికచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు పీడీ మాట్లాడుతూ స్నేహ బాలల గ్రామాలుగా చేయాలన్నారు. బాల్య వివాహాలు నిరోధించాలని, బాల కార్మికులు లేకుండా చూడాలని, వారిని బడికి పంపాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఆడ పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, డీసీపీఓ జాన్సన్, ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబీ, ఎంఈఓ బి.బాలాజీ, కంచికచర్ల, చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓలు వి.భాగ్యరేణుక, లక్ష్మీ భార్గవి, సూపర్‌వైజర్లు తారాబీ, కరీముల్లా పాల్గొన్నారు.

పౌరుల ఆరోగ్యమే ప్రధానం

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెలంపల్లి



క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్‌ను నియోజకవర్గంలోని చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోగల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని, తద్వారా అనారోగ్య బాధితులకు వైద్యులతో మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో వారికి ఆరోగ్యశ్రీ సేవలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులున్న ఇళ్లను ప్రత్యేకంగా పరిగణించి కాలానుగుణంగా వైద్య పరీక్షలు చేస్తూ మందులు, చికిత్స అందించాలని సూచించారు.

ఇళ్ల దగ్గరే ఏడు రకాల వైద్య పరీక్షలు..

అర్బన్ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, వలంటీర్లు తమ పరిధిలోని అన్ని ఇళ్లను సందర్శించాలని వెలంపల్లి తెలిపారు. ప్రజలకు వారి ఇంటి వద్దే బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, కఫం పరీక్షలతోపాటు జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగీ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. పరీక్షల ఫలితం ఆధారంగా సేకరించిన వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం ప్రతి ఇంటికి, పేషెంట్‌కి ఒక కేస్ షీట్ జనరేట్ అవుతుందని అన్నారు. ప్రతి పేషెంట్ ఈ సేవలను ఉచితంగా అందుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, కార్పొరేటర్లు గోదావరి గంగ, మైలవరపు రత్నకుమారి, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, సీఎంఓహెచ్ డాక్టర్ పి. రత్నావళి, 47వ డివిజన్ పార్టీ నాయకులు గోదావరి బాబు, కూరాకుల నాగ, కామశ్ల జోజి, మద్దిరాల కమలాకర్, తాంగ్ర ఇంద్ర కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివకుమారి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులపై ఉందని లయోల కళాశాల ప్రొఫెసర్ బి. శివకుమారి అన్నారు. 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు ఆంధ్రలయోల కళాశాలలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ, విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు.. పేద కుటుంబంలో జన్మించి శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి రాష్ట్రపతి స్థాయికి చేరిన అబ్దుల్ కలామ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ అక్టోబర్ చివరి వారంలో సైన్స్ ప్రాజెక్టులపై పాఠశాల విద్యార్థులకు పోటీలుంటాయన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు గైడ్ టీచర్ సహాయంతో తాము ఎంచుకున్న అంశాలపై పరిశీలనలు చేసి కేస్ స్టడీస్ ఆధారంగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయవలసి ఉంటుందన్నారు. అనంతరం బాలల సైన్స్ కాంగ్రెస్ విధి విధానాల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైన్స్ కాంగ్రెస్ నిర్వాహకులు జయలక్ష్మి, నాగేశ్వరరావు, ప్రసాద్ బాబు, శ్రీనివాసరావులతో పాటు సుమారు 240 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు వేగవంతం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు, గృహ విద్యుత్ కనెక్షన్ల కేటాయింపు చర్యలు త్వరితగతిన చేపట్టాలని ఏపీ సీపీడీసీఎల్ ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్ఈ ఎ.మురళీ మోహన్ ఆదేశించారు. స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నూజివీడు, గుడివాడ డివిజన్ విద్యుత్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జగనన్న కాలనీలోని లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్‌ను ఉచితంగా మంజూరు చేయాలని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తక్షణమే మార్పు చేయాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేయాలని ఎస్ఈ సూచించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు నిమిత్తం వస్తున్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, నిర్ణీత రుసుము చెల్లించిన రైతులకు తక్షణమే విద్యుత్ సదుపాయం అందించాలన్నారు. డీఈ హనుమయ్య, గుడివాడ, నూజివీడు డివిజన్ ఈఈ, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మద్దతివ్వడం సిగ్గుచేటు

ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్



మసీదు వద్ద మాట్లాడుతున్న గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వ పాలనలో ముస్లిం మైనారిటీలను మోసగించిన చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న నేపథ్యంలో కొందరు మైనారిటీలు ఆయనకు మద్దతు తెలపటం సిగ్గుచేటని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. శుక్రవారం భవానీపురం పున్నమీఘాట్ వద్దగల మొహమ్మదీయ మసీదులో తొలుత ఆయన నమాజు చేశారు. అనంతరం బయట మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకు లేని మద్దతు ఉన్నట్లు చూపేందుకు ఆరాటపడుతున్న టీడీపీ నాయకులు గత రెండు రోజులుగా ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. మొన్న కుప్పంలో, నిన్న విజయవాడ పశ్చిమంలో బుద్ధా వెంకన్న, జలీల్‌ఖాన్, ఎంఎస్ బేగ్‌లు కొంత మంది టీడీపీ నాయకులను పోగేసి మద్దతు ఉన్నట్లు చూపిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో గుంటూరులో జరిగిన నారా హమారా సభలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించిన ముస్లిం యువతపై దేశద్రోహం నేరం మోపి నిర్బంధించి హింసించిన చరిత్ర చంద్రబాబుదన్నారు. అటువంటి వ్యక్తి అవినీతి కేసులో అరెస్ట్ అయితే మైనారిటీలు ఎలా మద్దతు ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో షేక్ హసన్ బాషా, షేక్ బాజీ షహీద్, షేక్ గౌస్, ఖలీలుల్లా ఖాన్, మహమ్మద్ హాఫీజ్, ఎండీ సయిూద్, షేక్ ఇమ్రాన్, రవూఫ్, జబీయుల్లా తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



నందిగామ: వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నందిగామ పట్టణంలోని పలు కూడళ్లలో కళాకారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు మట్టితో చేసిన వినాయకుడిని పూజించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయకుడిని పూజించడం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరిస్తూ పలు స్కిట్స్ ప్రదర్శించారు. పట్టణంలోని బస్టాండ్, రైతుపేట, గాంధీ సెంటర్, భారత్ టాకీస్ రోడ్, మెయిన్ బజార్, రథం సెంటర్, పాత బస్టాండ్ ప్రాంతాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


భార్యపై ఇటుక రాయితో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యపై ఇటుక రాయితో దాడికి పాల్పడిన భర్తపై కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ ఆలీయాబేగం, మొహిద్దీన్ భార్యాభర్తలు. మొహిద్దీన్ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. మొహిద్దీన్‌కు డబ్బులు అవసరం ఉన్నప్పుడల్లా భార్యను అడగడంతో తెలిసిన వారి వద్ద అప్పులు చేసింది. ఇలా మొత్తం రూ. 6 లక్షల మేర అప్పులు చేయగా, అప్పు ఇచ్చిన వారు తిరిగి డబ్బులు ఇవ్వాలని ఆలీయాబేగంపై ఒత్తిడి చేయసాగారు. దీంతో అప్పులు తీర్చేందుకు మార్గం చూడాలని ఆలీయా బేగం భర్తను అడగడంతో గురువారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మొహిద్దీన్ తన చేతికి దొరికిన ఇటుక రాయిని తీసుకుని భార్యపై దాడి చేయడంతో గాయమైంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వివాహితతో అసభ్యకర ప్రవర్తన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం గ్రామానికి చెందిన చిట్టి మాధవికి రమేష్‌తో వివాహమైంది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో కొంత కాలంగా వేరు వేరుగా ఉంటున్నారు. గురువారం రాత్రి 12 గంటల సమయంలో మాధవి ఇంటి సమీపంలో నివసించే దారం సన్ని వచ్చి తలుపు కొట్టసాగాడు. దీంతో నిద్ర లేచిన మాధవి ఎందుకు తలుపు కొడుతున్నావంటే ఒక సారి మాట్లాడాలని చెప్పాడు. దీంతో తలుపు తీసిన మాధవి ఇంట్లోకి ప్రవేశించిన సన్ని ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేకలు వేసి బయటకు పరుగులు తీసింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రతి ఇంజినీర్‌కు ఆదర్శం మోక్షగుండం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నేటి యువత మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూర్తి చేసిన ప్రాజెక్టుల గురించి తెలుసుకుని స్ఫూర్తిని పొందాలని నీటి పారుదలశాఖ రిటైర్డ్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డాక్టర్ బి.వెంకటరామారావు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఇంజినీర్స్ డే నిర్వహించారు. వెంకటరామారావు అతిథిగా హాజరై మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మన దేశానికి చెందిన మొట్టమొదటి సివిల్ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని అన్నారు. మనదేశంలోని 8 విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించాయన్నారు. అనంతరం వెంకటరామారావు దంపతులను సన్మానించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి సభకు అధ్యక్షత వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎంవీ బాబు, కార్యదర్శి ఎన్.గోపిచంద్, రిటైర్డ్ అధ్యాపకుడు వి.భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు

పెనమలూరు: తల్లీకుమార్తెల అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. తాడిగడప కార్మికనగర్‌కు చెందిన వి.కోటేశ్వరరావు, కవిత చక్రవర్తి గత కొద్ది సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె తేజశ్విని ఉంది. భర్త సెల్‌ఫోన్ షోరూమ్‌లో పని చేస్తాడు. కాగా కవితాచక్రవర్తి, ఆమె కుమార్తె తేజశ్విని ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. వారి కోసం కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు మెగా మెడికల్ క్యాంప్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రైవేటు హాస్పిటల్స్‌లో వేలాది రూపాయలు ఖర్చు లేకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించే లక్ష్యంతో శర్వాణి లెబోరేటరీ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు సంస్థ అధినేత, స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఈ వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రముఖ హాస్పిటల్స్ నుంచి పలు విభాగాల వైద్యులు అన్ని రకాల పరీక్షలతో పాటు గుండె సంబంధిత వ్యాధులు, ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలు, సుగర్, బీపీ, స్త్రీల సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్లు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

18న సహస్ర కుడుముల అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితిని పురస్కరించుకుని ఈనెల 18వ తేదీ సోమవారం ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో లోక కల్యాణార్థం సహస్ర కుడుములతో అర్చన నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు సహస్ర కుడుముల అర్చనలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



42వ డివిజన్‌లో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. బందరు రోడ్డుకు దీటుగా భవానీపురం ప్రాంతాన్ని అభివృద్ధి చేశామన్నారు. శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 42వ డివిజన్‌లో కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ డివిజన్‌లో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని తక్షణమే పరిష్కరించేందుకు అధికారులతో కలిసి పర్యటించామన్నారు. స్థానిక ప్రజలతో ముచ్చటించారు. పలు డ్రైయిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో రోడ్లన్నీ నూతనంగా నిర్మించామన్నారు. పార్కులను సుందరీకరించామన్నారు. మరికొన్ని రోడ్లు అభివృద్ధి చేయాల్సి ఉందని, వాటిని త్వరితగతిన అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

మేము చెప్పిందే నిజమైంది..

ప్రతిపక్ష టీడీపీ, జనసేన రెండు వేర్వేరు కాదని, రెండూ ఒకటే అని తాము మొట్టమొదటి రోజు నుంచి చెబుతున్నామని వెలంపల్లి అన్నారు. తాము చెప్పిందే నిజమైందని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ సాక్షిగా పవన్ కల్యాణ్ ప్రతిపక్ష నేత చంద్రబాబుకు దత్తపుత్రుడని రుజువు చేసుకున్నారన్నారు. పవన్ పార్టీ పెట్టిందే చంద్రబాబు కోసమన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 42వ డివిజన్ కార్పొరేటర్ పడిగపాటి చైతన్య రెడ్డి, పడిగపాటి సుబ్బారెడ్డి, పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ తనుబుద్ది చంద్రశేఖర్ రెడ్డి, పువ్వాడ వెంకటేశ్వర్లు, బండారి వెంకట్, అజీజ్, టి. ప్రతాప్‌రెడ్డి, రమణ,రాజు, రామరావు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని అప్పుడే సమాజానికి మేలు జరుగుతుందని డీఆర్‌డీవో (హైదరాబాద్) శాస్త్రవేత్త కె. సాంబశివరావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా టెక్ లీగ్ పేరుతో హైస్కూల్, కళాశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కె. సాంబశివరావు మాట్లాడుతూ నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో అనేక అభివృద్ధి అంశాలు ప్రపంచ వ్యాప్తంగా కనబడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో నూతన సాంకేతిక విప్లవాన్ని ప్రజలకు మేలు చేసే దిశగా తీసుకెళ్లేందుకు విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త ఎస్. హనుమంతరావు ఇస్రో అందిస్తున్న ఉపగ్రహాల వివరాలను విద్యార్థులకు వివరించారు. ఉపగ్రహాల వల్ల ప్రపంచానికి ఏ విధమైన మేలు జరుగుతుందనే విషయాలను వివరిస్తూ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల కార్యదర్శి పి. లక్ష్మణస్వామి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో లీగ్ సీఈవో నల్లమిల్లి వెంకటరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పతంజలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్. మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలతో కూడిన మట్టి గణపతిని పూజిద్దాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్ సత్యవతి

పటమట(విజయవాడతూర్పు): విత్తనాలతో కూడిన మట్టి వినాయకుడిని పూజించి.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దామని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి పిలుపునిచ్చారు. మట్టి గణపతి విగ్రహాల ఏర్పాటుపై శుక్రవారం లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడకు మండపాల ఏర్పాటుకు అనుమతి కోసం వచ్చిన వారితో ఆమె మాట్లాడారు. విత్తనాలతో కూడిన మట్టి వినాయకుని పూజించడమే కాకుండా వినాయకుని పందిళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, పర్యావరణ అనుకూలమైన వస్తువులనే వాడాలని ఆమె పేర్కొన్నారు. ఈ పండుగలో ఉపయోగించే పూజ పుష్పాలు, ఆకులు, పండ్లను నిరుపయోగంగా పారవేసే విధానాన్ని మార్చుకోవాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ, గ్రీన్ వేవ్స్ రీసైక్లర్‌తో కలిసి వినూత్నంగా చేపట్టిన వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా నిరుపయోగమైన పువ్వులను, ఆకులను పరిమళమైన అగరబత్తీలు, కొవ్వొత్తులతో ధూపాలను తయారుచేస్తున్నామన్నారు. మిగిలిన వ్యర్థాలను విండ్రో కంపోస్ట్ ద్వారా ఎరువుగా మార్చుతామని చెప్పారు. ఈ వినాయక చవితి పూజ అనంతరం, పుష్పాలను, ఆకులను నగరపాలక సంస్థ వారు ప్రత్యేకంగా కేటాయించిన డబ్బాలలో వేసి అందించాలని సూచించారు. ఒకవేళ ఎక్కువ మొత్తంలో పుష్పాలు, ఆకులు, పండ్లను అందించడంలో మరింత సమాచారం కావాలంటే గ్రీన్ వేవ్స్ రీసైక్లర్(919676152910)ను సంప్రదించాలని కోరారు.

ముగిసిన శ్రావణమాస పూజలు



పెనమలూరు: యనమలకుదురులో శ్రావణమాసం నెలరోజుల పాటు జరిగిన ప్రత్యేక పూజలు, చండీ హోమం పూజా కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో మహా పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. నెల రోజులపాటు జరిగిన చండీ హోమంలో పాల్గొన్న భక్తులకు ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దంపతులు భక్తులకు స్వామివారి ఫొటో, ప్రసాదం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు, ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్, భక్తులు పాల్గొన్నారు.

వీలునామా నోటీసు

పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలం, తణుకు మున్సిపల్ ఏరియాలోని, సజ్జాపురం, డోర్ నెం.23 12 1/1 లో కాపురముండు మలిరెడ్డి నాగభూషణ రెడ్డి గారి కుమారుడు రామ్‌దాస్ రెడ్డి గారు తన తాలూకు నందివాడ గ్రామంలోని ఎ.3 09సెం భూమిని తన భార్య అయిన హంసవేణి కు, నందివాడ గ్రామంలోని ఎ.7 18సెం భూమిని తన కుమార్తె అయిన లక్ష్మీ రేణుక కు, [illegible] గ్రామం తాలూకు చ.గ.610లు స్థలము, [illegible] [illegible] గ్రామంలోని ఎ.5 00సెం భూమి, [illegible] మున్సిపల్ [illegible] ఏరియాలోని [illegible] చ.గ.60లు స్థలము, అందులోని 23 [illegible] అను భవనములో గ్రౌండ్ ఫ్లోర్‌లో 1/2వంతు, తణుకు మున్సిపల్ ఏరియాలోని తణుకు–వేమవరం తాలూకు చ.గ.690.16 లు స్థలమున్నూ, [illegible] గ్రామ పంచాయితీ ఏరియాలోని [illegible] గ్రామంలో ఎ.3 08సెం భూమిన్నీ, [illegible] గ్రామం తాలూకు ఎ.1 60సెం భూమిన్నీ, తెలంగాణా రాష్ట్రం, మహేశ్వరం గ్రామం తాలూకు చ.గ.200లు స్థలమున్నూ తన కుమారుడు భరత్ భూషణ్‌రెడ్డికి తన తదనంతరం చెందునట్లు ది.17-02-2022 సం.రం.తేదీన ఒక వీలునామా వ్రాసినట్లున్నూ సదరు వీలునామా రిజిష్టరు చేయించకుండానే ది.26-04-2023 సం.రం.తేదీన చనిపోయినట్లున్నూ చెప్పుచూ సదరు మలిరెడ్డి రామ్‌దాస్ రెడ్డి గారి భార్య అయిన మలిరెడ్డి హంసవేణి గారు సదరు వీలునామాను ఈ ఆఫీసులో ది.08-09-2023 సం.రం.తేదీన విచారణ నిమిత్తము దాఖలు చేసినారు. సదరు వీలునామా ఉత్పత్తిని గురించి ఈ ఆఫీసులో ది.29-09-2023 వ సం.రం.తేదీన పగలు గం.10-30 ని. లకు విచారణ ప్రారంభించబడును. సదరు వీలునామాపై ఏమైనా అభ్యంతరం ఉన్నచో సదరు వీలునామాను ఆక్షేపించు కక్షిదారుల సదరు తాయిదా నాటికి ఖుద్దున గాని అధికారము పొందిన వకీలు ద్వారా గాని ఈ ఆఫీసులో హాజరయి తమ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. సాక్షులకు సమన్లు చేయించుకొను కక్షిదారులు తాయిదా తేదీ నాటికి వారము రోజులు ముందుగా పట్టీ సమనులు చేయించుకొనవచ్చును.

సబ్ రిజిష్ట్రారు కార్యాలయము, సజ్జాపురం, ది.15.09.2023

సబ్ రిజిష్ట్రారు, సజ్జాపురం